క్లుప్తంగా

అమర్‌నాథ్‌కు అభినందనలు



అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గాజువాక: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను ఆ పార్టీ గాజువాక నాయకులు సత్కరించారు. పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్డు పూడి పరదేశి ఆధ్వర్యంలో ఆదివారం మిందిలో అమర్‌నాథ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజాన వెంకటరావు, కాకినాడ పెంటారావు, ములకలపల్లి వెంకటేష్, బొద్ద గోవింద్, పిట్టా రెడ్డి, టీకేటి శ్రీను, కాకర విజయ్ కుమార్, పెద్దాడ వెంకట రమణ, మారెడుపూడి ప్రదీప్ చందు, మహ్మద్ గౌస్, లోకనాథం, సంతోష్ తదితరులు ఉన్నారు.

క్రీడా మైదానంలో స్వచ్ఛభారత్



75వ వార్డులో క్రీడామైదానాన్ని శుభ్రం చేస్తున్న పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ సభ్యులు

పెదగంట్యాడ: పత్రీజీ పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని క్రీడా మైదానంలో ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా క్రీడామైదానంలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. ట్రస్ట్ సభ్యులు చీపుర్లు చేత పట్టి మైదానం మొత్తం శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరి పారేశారు. వాకింగ్ ట్రాక్‌ను శుభ్రం చేశారు. మీసాల శివ గణేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పులి వెంకటరమణారెడ్డి, రేవతి దేవి, పులి సురేష్‌రెడ్డి, వనిత, పద్మావతి, వర్మరాజు, అప్పారావు, మూర్తి, అప్పలరాజు, నీలకంఠం, దేవిక, పిట్టా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న యువత

పెదగంట్యాడ: యువత రక్తదానానికి ముందుకు రావాలని న్యూపోర్టు పోలీస్ స్టేషన్ సీఐ దాలిబాబు పిలుపునిచ్చారు. ఓపెన్ ఆర్మ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ 65వ వార్డు ప్రియదర్శిని కాలనీ రామాలయం వద్ద తమ స్నేహితుడైన అంగ ప్రదీప్ జ్ఞాపకార్థం ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని సీఐ దాలిబాబు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్తం అందుబాటులో లేక ఎవరి ప్రాణాలు పోయే పరిస్థితి రాకూడదని, రక్తదానానికి యువత పెద్ద సంఖ్యలో ముందుకు రావాలని కోరారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్, నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, పల్లా కార్తీక్, రెయ్యి రత్న, పల్లవసేన రాష్ట్ర అధ్యక్షుడు సమ్మిడి ఆనందరావు, రామారావు, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ కులస్తులను ఆర్థికంగా ఆదుకోవాలి

దాబాగార్డెన్స్: సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్న గౌడ కులస్తులకు గౌడ కుల కార్పొరేషన్ ద్వారా దామాషా ప్రకారం నిధులు కేటాయించాలని కూటమి ప్రభుత్వాన్ని ఉత్తరాంధ్ర గౌడ సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. విశాఖ జిల్లా గౌడ సంఘ కార్యాలయంలో ఆదివారం ఉత్తరాంధ్ర జిల్లాల గౌడ సంఘం ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గౌడ కులస్తులు ఎదుర్కొంటున్న పలు అంశాలు కూటమి ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లామని, సమస్యలు పరిష్కరించడమే గాక అన్ని విధాలా ఆదుకుంటామని సానుకూలంగా స్పందించారని చెప్పారు. సమస్యలను ఎక్కడికక్కడ నేతలకు వివరించాలన్నారు. సమావేశంలో వెంకట సుబ్బారావు, రామారావు పాల్గొన్నారు.



అగనంపూడి టోల్‌గేటు సమీపంలో జాతీయ రహదారిపై ప్రమాదకరంగా గోతులు



సాయిబాబా గుడి వద్ద ఏర్పడిన గోతులు

అడుగడుగునా గొయ్యి... చూసి అడుగెయ్

- గోతులమయంగా జాతీయ రహదారి
- కూర్మన్నపాలెం నుంచి లంకెలపాలెం వరకూ అధ్వానంగా రోడ్డు
- ప్రమాదాలకు గురవుతున్న వాహన చోదకులు



కళాశాల ఎదురు రోడ్డులో గోతులు



అగనంపూడి సిగ్నల్ పాయింట్‌కు రెండు వైపులా ధ్వంసమైన రహదారి

అగనంపూడి: వర్షాలకు జాతీయ రహదారి ఎక్కడికక్కడే గోతులతో నిండిపోయింది. కూర్మన్నపాలెం కూడలి నుంచి లంకెలపాలెం జంక్షన్ వరకు అడుగడుగునా గోతులు ఏర్పడ్డాయి. దీంతో వాహనచోదకులు బెంబేలెత్తుతున్నారు. పారపాటున భారీ వాహనాల వెంబడి ద్విచక్ర వాహనచోదకులు వెళ్తే గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారి చాలా చోట్ల ధ్వంసం కావడంతో ప్రయాణం నరక ప్రాయంగా మారిందని వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి

టోల్‌గేటుకు రెండు వైపులా, జూనియర్ కళాశాల వద్ద, ఆర్టీవో కార్యాలయం సమీపంలో, హనుమాన్ కూడలి, ఆలిండియా రేడియో రిసీవింగ్ స్టేషన్, అగనంపూడి కూడలి, సాయిబాబా గుడికి రెండు వైపులా, సెక్టార్-1, వంతెనకు రెండువైపులా, ఇ.మర్రిపాలెం కూడలి, లంకెలపాలెం కూడలిలోని మలుపు వద్ద రహదారి పూర్తిగా శిథిలమైంది. వాహనచోదకులు అప్రమత్తంగా లేకపోతే ఆస్పత్రి పాలవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మార్గంలో వేగంగా ప్రయాణిస్తే ఒళ్లు హూనం అవ్వక తప్పదు. గోతులు కూడా లోతుగా ఉండడంతో ద్విచక్ర వాహనాలు వాటిలో దిగితే వాహనాలు అదుపు తప్పి తూలి కింద పడిపోతున్నారు.

- శనివారం అగనంపూడి నిర్వాసిత కాలనీకి చెందిన దేముడు అనే వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా అదుపు తప్పిగోతులో వాహనం దిగింది. దీంతో అతను గాయాలపాలయ్యాడు. ఆ సమయంలో వెనుక నుంచి వాహనాలు రాకపోవడంతో దేముడు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.

నిర్వహణ గాలికి!

జాతీయ రహదారుల నిర్వహణ పేరుతో వందల కోట్ల రూపాయలు వసూలు చేస్తున్న భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) రెండు మాసాల నుంచి గోతులతో పాట్లు పడుతున్నా, **ఫీజు చేస్తున్నా కనీసం** గోతులు పూడ్చడానికి ముందుకు **రాకపోవడం** సరికాదని ప్రయాణికులు వాపోతున్నారు.

ఇంత నిర్లక్ష్యమా!



వీధి రోడ్లు వదిలేసినట్టు వదిలేస్తే ఎలా?. రోజూ వేలాది వాహనాలు అదుపు తప్పిన వేగంతో ప్రయాణం చేస్తాయి. అలాంటి జాతీయ రహదారి పెద్ద పెద్ద గోతులతో నిండిపోతే కనీసం స్పందించకపోవడం సరికాదు. టోల్‌గేటు పెట్టి వేల కోట్లు దండుకున్నారు. మరమ్మతులు కూడా చేయలేరా. ఇదెక్కడి అన్యాయం. తక్షణం జాతీయ రహదారిపై గోతులు పూడ్చి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి.

– కె.రవి, నిర్వాసితకాలనీ

భయం.. భయంగా ప్రయాణం



పగటి పూటే జాతీయ రహదారిపై వెళ్లాలంటే భయపడుతున్నాం. వాహనాలు నెమ్మదిగా నడపాల్సి వస్తుంది.అయినా గోతుల్లో వాహనాలు దిగిపోతున్నాయి. వాహనం తూలి కింద పడే సమయంలో వెనుక నుంచి వాహనాలు వస్తే పరిస్థితి ఏంటో అధికారులు, పాలకులు ఆలోచించాలి. వెంటనే రహదారి పునర్నిర్మాణం చేపట్టాలి.

– ఎస్.శంకరరావు, దువ్వాడ

జాషువా రచనలు అజరామరం



గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వక్తలు

ఉక్కునగరం: మహాకవి గుర్రం జాషువా రాసిన రచనలు అజరామరంగా మిగిలి ఉన్నాయని కవి, సాహితీ విశ్లేషకులు డాక్టర్ మాటూరి శ్రీనివాస్ అన్నారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గుర్రం జాషువా 129వ జయంతి సభలో ఆయన మాట్లాడారు. నాడు కుల ఆధిపత్యం వల్ల కలిగే సామాజిక విధ్వంసాన్ని వేయి గొంతులతో ధిక్కరించి మరణం లేని మానవత్వానికి తన సాహిత్యంతో పట్టాభిషేకం చేసిన నవయుగ కవి చక్రవర్తి జాషువా అని కొనియాడారు. స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ టి.కె.ఎస్.ఆర్. ఠాగూర్ మాట్లాడుతూ సమాజంలో కొన్ని వర్గాలకే సొంతం అని చెప్పుకునే సాహిత్యాన్ని జాషువా తిరగ రాశారన్నారు. కార్యక్రమంలో బయ్యే మల్లయ్య, వి. ప్రకాశ్, వరకుమార్, సంపూర్ణం, కె. బాలశౌరి, వై.టి. దాస్ పాల్గొన్నారు.

10 కిలోల గంజాయి పట్టివేత

సీతమ్మధార : ఇతర రాష్ట్రాలకు గంజాయి తరలిస్తున్న ముగ్గురు సభ్యుల ముఠాని ద్వారక జోన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఒడిశాకు చెందిన అజయ్‌కుమార్ (24), నందుకోహరా (28), చంద్రపంగి (25) కలిసి బెంగళూర్‌కు గంజాయి తరలించేందుకు రామాటాకీస్ దరి కంటి ఆస్పత్రి వద్దకు ఆదివారం చేరుకున్నారు. వారి కదలికలు అనుమానాస్పదంగా ఉండడంతో పోలీసులు బ్యాగులు తనిఖీ చేయగా రెండు ప్యాకెట్ల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సీఐ డి.వెంకటరమణ నేతృత్వంలో ఎస్ఐ శ్రీను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



యారాడ తీరం వద్ద పూర్వ విద్యార్థుల సందడి

పెదగంట్యాడ: పూర్వ విద్యార్థులు సందడి చేశారు.. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు.. ఆలింగనం చేసుకుని గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అలనాటి చిలిపి చేష్టలను నెమరువేసుకున్నారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1995–96లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు యారాడ తీరం వద్ద ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా ఒక అసోసియేషన్‌గా ఏర్పడ్డారు. తమతో పాటు కలసి చదువుకున్న సహచర మిత్రులు ఆర్థిక సమస్యలతో బాధపడుతుంటే ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం చేస్తామని వివరించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ముందుగా తమతో కలసి చదువుకుని మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. విద్యార్థులను వెన్నుతట్టి ప్రోత్సహించిన పీటీ లంకా డానియల్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. గెద్దాడ అప్పలరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏకుల వెంకటేష్‌గౌడ్, సారిపల్లి చిన్నారావు, టి. మోహన్, కండిపల్లి గురుమూర్తి,బొట్ట రమణ, మద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉచ్ఛిష్ట గణపతి నిమజ్జనోత్సవం



హాజరైన భక్తులు

- భారీగా తరలివచ్చిన భక్తులు



ప్రసంగిస్తున్న శ్రవణచైతన్యాందస్వామి



నిమజ్జనం చేస్తున్న దృశ్యం

గాజువాక: స్థానిక శ్రీనగర్‌లో ఎస్‌వీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన 89 అడుగుల ఉచ్ఛిష్ట మహాగణపతి విగ్రహ నిమజ్జన మహోత్సవం ఆదివారం నేత్రపర్వంగా సాగింది. గత నెల 7న ప్రారంభమైన భారీ గణపతి ఉత్సవాలను 21 రోజుల పాటు కొనసాగించారు. స్వామివారికి తొలుత శ్రవణ చైతన్యానంద స్వామి,మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాలు, నెయ్యి, కుంకుమ, పసుపుతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విగ్రహాన్ని వాటర్ ట్యాంకుల ద్వారా తెచ్చిన నీటితో కరిగించారు. సాయంత్రం ఏడు గంటలకు ప్రారంభమైన అనుపోత్సవం రాత్రి 10 గంటలకు పూర్తయింది. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకుడు కొసిరెడ్డి గణేష్, బీజేపీ సీనియర్ నాయకుడు బాటా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బౌద్ధ 'వస్సావాస' ముగింపు సభ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బౌద్ధ మిషన్ ఆధ్వర్యంలో ఆదివారం 'వస్సావాస' ముగింపు సభ ఘనంగా జరిగింది. బుద్ధ విహార్‌లో జరిగిన వస్సావాస ప్రసంగ శ్రేణి–2004లో భారతీయ బౌద్ధ మహాసభ, సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షులు బేతాళ సుదర్శనం ప్రసంగించారు. బౌద్ధంలో వస్సావాస అనేది ఎంతో ప్రాముఖ్యం గల సంప్రదాయం అని చెప్పారు. వర్షాకాలంలో మూడు నెలల పాటు, సాధారణంగా ఆషాడ మాసం మొదలు కార్తీక మాసం వరకు బౌద్ధ సంఘంలో భిక్షువులు ఒక ప్రదేశంలో ఉండి ధ్యానం, ఉపదేశం, అభ్యాసం చేస్తారన్నారు. మహాబోధి సొసైటీ జిల్లా అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ వర్షాకాలంలో యాత్రలు చేసేటప్పుడు పశు, పక్షులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు భిక్షువులు ఒకే ప్రదేశంలో ఉండటానికి ప్రాధాన్యం ఇస్తారన్నారు. కార్యక్రమంలో బాలభాస్కరరావు, పరమట సత్యనారాయణ, అంబటి సర్వేశ్వరరావు, పాల్తేటి పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఓనం ఉత్సవాలు



మంత్రముగ్ధుల్ని చేసిన నృత్య ప్రదర్శన



సాంస్కృతిక ప్రదర్శనలో కళాకారులు

అగనంపూడి: తమ ప్రాంత సాంప్రదాయాన్ని అందరితో పంచుకోవడం ఆనందంగా ఉందని కమడోర్ ఎం.లారెన్స్, ఫెర్నాండేస్‌లు అన్నారు. జీవీఎంసీ 88వ వార్డు గ్రీన్‌సిటీ ఆవరణలో ఆదివారం ఓనం ఉత్సవాలను వారు ప్రారంభించి మాట్లాడారు. కేరళలోని వివిధ ప్రాంతాలకు చెందిన మళయాలీలు అంతా కలిసి నిర్వహించే పండగలో పాలు పంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. అంతా కుటుంబ సభ్యులతో కలిసి ఐకమత్యంగా పండగ చేయడం శుభ పరిణామన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బాలలకు ఆటల పోటీలు నిర్వహించారు. గాజువాక కైరళి ఆర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు పి.ఎస్.బిజూ మాట్లాడుతూ గాజువాక క్లబ్ ఆధ్వర్యంలో ఏటా ఓనం ఉత్సవాలు నిర్వహిస్తుండడం, మళయాలీలంతా ఒకేచోట చేరుకొని ఆనందాన్ని పంచుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జాతీయ మళయాలీల అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.జి.విజయ్ కుమార్, ఆలిండియా మళయాలీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ఎం.పిళ్లై, ఎన్ఎస్‌టీసీ డైరెక్టర్ అబ్రహమ్ వర్గీస్, కె.కిజగుద్దీన్, గాజువాక క్లబ్ కార్యదర్శి శ్యాంజా, కోశాధికారి శరత్, ఆశీమ్, జిపిక్, ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్లు



రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఉక్కునగరం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని, దాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా 32 మంది సుప్రీం కోర్టులో కేసులు ఫైల్ చేశారని జాతీయ బౌద్ధ మహాసభ సమతా సైనిక దళ్ రాష్ట్ర అధ్యక్షుడు బి. సుదర్శనం అన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో లేని పదాలను ఆపాదించారని ఆవేదన వ్యక్తం చేశారు. 1935 నుంచి కుల గణన జరగలేదన్నారు. వర్గీకరణ వల్ల ఉప కులాల మధ్య వైషమ్యాలు పెరుగుతాయి తప్పా ఎటువంటి ఉపయోగం ఉండదన్నారు. సుప్రీంకోర్టు తీర్పును పున:పరిశీలించాలని ఆయన కోరారు. డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ గ్లోబల్ మిషన్ అధ్యక్షుడు బయ్యే మల్లయ్య అధ్యక్షత వహించిన కార్యక్రమంలో మాటూరి శ్రీనివాసరావు, పాల్తేటి పెంటారావు, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్టు రంగంలో ప్రాంతీయ భేదాలు తగవు



సమావేశంలో మాట్లాడుతున్న జానకిరామిరెడ్డి

గాజువాక: ట్రాన్స్‌పోర్టురంగంలో మన ప్రాంతం, వేరే ప్రాంతం అనే భేదాలు తగవని ఉత్తరాంధ్ర ట్రాలర్, ట్రక్కు ఓనర్స్ అండ్ సప్లయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.జానకిరామిరెడ్డి అన్నారు. గాజువాకలో ఆదివారం నిర్వహించిన సంఘ సభ్యుల విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. వేరే ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తున్న ట్రాన్స్‌పోర్టు వాహనాల పట్ల కొంతమంది స్థానిక ట్రాన్స్‌పోర్టు యూనియన్ సభ్యులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని, తెలుగు, హిందీవారంటూ బేధాలు చూపిస్తున్నారని అన్నారు. ఇలాంటి బేధాలు చూపించడం మానుకోవాలన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షులు జ్యోతిరెడ్డి, సాయిరెడ్డి మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్టు రంగం చాలా విశిష్టమైందని, వర్గ, కుల విభేదాలు, ప్రాంతీయ బేధాలు లేకుండా కలసికట్టుగా వ్యాపారాలు కొనసాగించాలన్నారు. అలా కాదని తమ సంఘంలోని సభ్యుల జోలికొస్తే ఊరుకొనే ప్రసక్తే లేదన్నారు. ఎవరైనా ప్రత్యక్షంగా ఎదుర్కోవాలే తప్పా దాడులకు పాల్పడడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఐ.రాజా, ప్రతినిధులు పీజేఆర్ ఎస్ మహారథి, మిశ్రా పైవహన్, అరవింద్ మిశ్రా, ఆర్.భాస్కరరావు, చట్టి గోపి తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి సాగరగిరి కనకదుర్గ శరన్నవరాత్రి మహోత్సవాలు

అల్లిపురం: యారాడ కొండపై వెలసిన సాగర గిరి కనకదుర్గమ్మ అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలను అక్టోబర్ 3వ తేదీ నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ తెలిపింది. 3వ తేదీ ఉదయం 9.15 గంటలకు కలశ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అమ్మవారు రోజు కొక అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. 3వ తేదీన బాల దుర్గాదేవిగా, 4న గాయత్రీ దేవిగా, 5న అన్నపూర్ణదేవిగా, 6న భువనేశ్వరిదేవిగా, 7న రాజరాజేశ్వరిదేవిగా, 8న లలితాదేవిగా, 9న సరస్వతీదేవిగా, 10న శాకంబరి దేవిగా, 11న చండీదేవిగా, 12న సాగర గిరి కనక దుర్గదేవిగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 4.45 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకాలు, పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహిస్తామన్నారు. ఉదయం 7 గంటలకు ప్రథమ పూజ, బాలభోగం నుంచి సాయంత్రం 6.30 గంటలకు పంచనేత్ర, నక్షత్ర హారతితో పూజాధికాలు ముగుస్తాయన్నారు.

బోటు సౌకర్యం..

అమ్మవారిని తొమ్మిదరోజుల పాటు దర్శించుకునే నిమిత్తం పాతపోస్టాఫీసు దరి ఫెర్రీ నుంచి యారాడ కొండ వరకు బోటు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సౌకర్యం ఉంటుందన్నారు. విశాఖ నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.